

నేడు గిరిరాజ్‌లో ఫొటో ఎగ్జిబిషన్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా మంగళ, బుధవారం గిరిరాజ్ కళాశాల ఆడిటోరియంలో స్వతంత్ర సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి.ధర్మానాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో పాటు అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు, ప్రజలు ఎక్కువ మొత్తంలో పాల్గొనాలని ఆయన కోరారు.



మానాల గ్రామపంచాయతీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న దృశ్యం

తొమ్మిది గ్రామాలను తిరిగి
జిల్లాలో కలపాలి

- మానాల గ్రామపంచాయతీ ఎదుట ప్రజాభిప్రాయ సేకరణ
- సహకరించాలని బాల్కొండ, వేములవాడ ఎమ్మెల్యేలకు గ్రామస్థుల వినతి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 12: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం మానాలతో సహా నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన మరో ఎనిమిది గ్రామాలను రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం నుంచి తొలగించి గతంలో మాదిరిగా నిజామాబాద్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ సోమవారం తొమ్మిది గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. ఇటీవలే పదవీ విరమణ పొందిన గ్రామపంచాయతీల తాజా మాజీ పాలకవర్గ సభ్యులు.. గతంలో చేసిన తీర్మాన ప్రతులతో ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. అయితే తమ గ్రామాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉండడంతో అటు ఉద్యోగపరంగా.. ఇటు రాజకీయపరంగా నష్టపోతున్నామని వాపోయారు. తండాలను గ్రామాలుగా మార్చి రాజన్న సిరిసిల్లా జిల్లాకు మార్చారని, కానీ అసెంబ్లీ నియోజకవర్గం బాల్కొండ, పార్లమెంట్ నియోజకవర్గం నిజామాబాద్‌గానే కొనసాగుతున్నాయన్నారు. తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అర్థంచేసుకుని తమ ఇబ్బందులను తొలిగిపోయేలా ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు. అభిప్రాయ సేకరణలో మానాల, గైదిగుట్ట తండా, అడ్డబోరుతండా, దేగావత్ తండా, రూప్లనాయక్ తండా, బడితండా, సర్పంచ్‌తండా, చింతామణితండా గ్రామాల ప్రజాప్రతినిధులు, తాజా మాజీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, వివిధపార్టీల నాయకులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు కసరత్తు





ఇంటి నిర్మాణానికి
రూ. 5 లక్షల సాయం

- జిల్లాకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- నియోజకవర్గానికి మూడువేల ఐదువందల ఇళ్ల కేటాయింపు
- మార్గదర్శకాలు వెలువడిన తర్వాత అర్హుల ఎంపిక
- శిథిలావస్థకు చేరిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- పర్యవేక్షణ లేక వస్తువులను ఎత్తుకెళ్లిన దొంగలు

నిజామాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద కొత్త ఇళ్లను మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తోంది. నియోజకవర్గానికి మూడువేల ఐదు వందల ఇళ్లను కేటాయించింది. అర్హుల ఎంపికకు మార్గదర్శకాలను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. కొత్త ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పంపిణీకి ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు. కోట్ల రూపాయలతో నిర్మించిన ఇళ్లు దెబ్బతింటున్నా.. లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. ఇళ్లకు సంబంధించిన మెటీరియల్, తలుపులు, కిటికీలు అపహరణకు గురవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఏళ్ల తరబడి వాటిని కేటాయించకపోవడం వృథాగా ఉండటం వల్ల ఆ ఇళ్లు దెబ్బతింటున్నాయి. పలు దఫాలు పేదలు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. తమకు ఇళ్లను కేటాయించాలని కోరారు. అయినా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేసిన ఇళ్లను కేటాయించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యేలు ఈ ఇళ్లను పేదలకు ఇవ్వాలని కోరుతున్నా.. ఇప్పటికీ కదలిక లేదు. కొత్త ఇళ్ల మంజూరుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం ఈ ఇళ్లను కొంత మందికి కేటాయిస్తే మేలు జరగనుంది. ఇళ్ల దెబ్బతినకుండా ఉండే అవకాశం ఉంది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. జిల్లాకు 15,304 ఇళ్లను కేటాయించారు. ఎనిమిదేళ్ల క్రితం ఆయా నియోజకవర్గాలు ఈ ఇళ్లను కేటాయించారు. అత్యధికంగా బాన్సువాడ నియోజకవర్గానికి ఇళ్లను మంజూరు చేశారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూం పథకం కింద బోధన్ నియోజకవర్గానికి 1712, బాన్సువాడకు 4988, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 1564, నిజామాబాద్ అర్బన్‌కు 2330, ఆర్మూర్‌కు 2130, బాల్కొండకు 2580 ఇళ్లను కేటాయించారు. ప్రభుత్వం ఈ ఇళ్లను మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించారు. ప్రభుత్వం పట్టణ ప్రాంతంలో 5లక్షల 25వేలు, గ్రామీణ ప్రాంతంలో 5లక్షల 5వేలుగా నిర్ణయించారు. ఈ ఇళ్ల నిర్మాణం కోసం మొదట టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లు తర్వాత డబ్బులతో ప్రభుత్వం నిర్ణయించిన విధంగా నిర్మాణం చేయడం వీలు కాకపోవడం, డబ్బులు సరిపోకపోవడంతో కాంట్రాక్ట్‌ను ఉపసంహరించుకున్నారు. కొన్ని నియోజకవర్గాలు మినహా మిగతా ప్రాంతాల్లో నిర్మాణానికి ముందుకు రాలేదు. అధికారులతో పాటు అప్పటి ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేసి తమకు దగ్గరగా ఉన్న వ్యక్తుల ద్వారా నిర్మాణం చేపట్టారు. ఇళ్లు మంజూరు చేసిన ఎనిమిదేళ్ల కాలంలో కేవలం 6162 ఇళ్లను పూర్తి చేశారు. మరో 9267 ఇళ్లు నిర్మాణం దశలో ఉన్నాయి. బాన్సువాడ, నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గంలో నిర్మాణం అయిన ఇళ్లను పేదలకు పంపిణీ చేశారు. బోధన్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గంలో మాత్రం ఈ ఇళ్ల నిర్మాణం



ఇళ్ల మధ్యలో పెరిగిన మొక్కలు

అయిన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించలేదు. ఆరేళ్ల క్రితం పూర్తయిన ఇళ్లు శిథిలావస్థ కు చేరుకుంటున్నాయి. పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ ఇళ్లకు సంబంధించిన కరెంటు వైర్లు, కిటికీలు, తలుపులతో పాటు ఇతర సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లిపోయారు.

ఆరేళ్ల క్రితం 648 ఇళ్లు పూర్తి

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ పరిధిలో 648 ఇళ్లను ఆరేళ్ల క్రితమే పూర్తి చేశారు. వీటి కోసం సుమారు రూ.40 కోట్లను ఖర్చు చేశారు. నాగారంతో పాటు కొత్త కలెక్టరేట్ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాన్ని చేశారు. నాగారంలో 496 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని చేశారు. ముందుగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినా ఇప్పటి వరకు వాటిని ఎవరికి కేటాయించలేదు. పలు దఫాలు లబ్ధిదారుల ఎంపిక చేశారు కానీ ఇళ్లను మాత్రం వారికి అందజేయలేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఇండ్లు ప్రస్తుతం దెబ్బతిన్నాయి. ఇళ్లను పట్టించుకోకపోవడం వల్ల చుట్టూ గడ్డి, చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. బైపాస్ రోడ్ లోని భవనాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఆర్మూర్‌లో 336 వరకు ఇళ్లు నిర్మాణమై ఉండగా బోధన్‌లోను 951 వరకు నిర్మాణం చేశారు. వీటిలో కొన్ని కేటాయించినా మిగతావి మాత్రం ఇప్పటికి ఖాళీగానే ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణం కోసం జిల్లాలో మొత్తం 397 కోట్ల రూపాయలను వెచ్చించారు. కొన్ని నియోజకవర్గాల పరిధిలో పేదలకు కేటాయించిన మిగతా చోట్ల కేటాయింపులు చేయకపోవడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు.



ధ్వంసమైన కిచెన్ గది, కిటికీలు

నూతన సర్కారు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని మళ్లీ ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఈ పథకం కింద 3,500 ఇండ్లను కేటాయించింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో కూడా ఇండ్లను మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వనున్నారు. జిల్లాకు ఈ యేడాది 19,250 ఇండ్లు మంజూరయ్యాయి. ఇంటి స్థలాలు ఉన్న వారికి వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి ఈ పథకం కింద ఇండ్లను మంజూరు చేస్తారు. ఐదు లక్షల రూపాయలను అందిస్తారు. ఎస్సీ, ఎస్టీలు అయితే 6లక్షల రూపాయలు ఇవ్వనున్నారు. గత ప్రభుత్వంలాగా ఇండ్ల నిర్మాణం చేసి ఇవ్వకుండా ఇందిరమ్మ ఇండ్ల కింద మంజూరు చేసి నిధులను నిర్మాణంలోకి విడుదల చేస్తారు. గృహ నిర్మాణం పథకానికి బడ్జెట్‌లోను నిధులు కేటాయించడం వల్ల పథకానికి గైడ్‌లైన్స్ ప్రభుత్వం విడుదల చేయగానే లబ్ధిదారులను నియోజకవర్గాల వారీగా ఎంపిక చేయనున్నారు. కొత్త పథకం కింద ఇళ్ల మంజూరుకు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరగనుంది. లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడిన తర్వాత ఇండ్ల నిర్మాణంపై నిర్ణయం ఉంటుందని ఇంజనీరింగ్ శాఖల అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ లేకపోవడం వల్ల ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా ఈ పనులను చేపట్టనుంది.



● పార్కులో నిలిచిన వర్షపు నీరు

పార్కులపై పట్టింపేది?

- నగరంలో అధ్వానంగా పార్కుల నిర్వహణ
- చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న పార్కులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



● పిచ్చిమొక్కలతో నిండిన పార్కు

సుభాష్‌నగర్, ఆగస్టు 12: ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన పార్కులు నిర్వహణ లేక అధ్వానంగా తయారయ్యాయి. నగరంలోని చాలా పార్కుల్లో అధికారుల పట్టింపు లేకపోవడంతో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. నగరంలో డివిజన్ ఒక పార్కు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఉన్న పార్కులనే పట్టించుకునే నాథుడు కరువయ్యారు. నగరంలోని కొన్ని పార్కులు మినహా చాలా వరకు పార్కులు అధ్వానంగా తయారయ్యారు. మరికొన్నిచోట్ల పార్కులు కాలనీవాసులు తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. నిరుపయోగంగా ఉన్న పార్కులలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో హడావిడిగా పార్కుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించినా.. పార్కులు మాత్రం మొత్తం పూర్తికాకుండానే ప్రారంభ స్థితిలోనే ఉన్నాయి. పార్కులలో ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, చెత్త తొలగించాల్సిన నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలో డివిజన్‌కు ఒక పార్కు చొప్పున అధికారులు పార్కులను అభివృద్ధి చేసారు. ఇవే కాకుండా నగరంలోని లేఅవుట్ పార్కులు అమరవీరుల పార్కు, ఇంకా కొన్ని పార్కులు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం చాలా పార్కులు నిర్వహణ లేకపోవడంతో పార్కుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆహ్లాదం కోసం పార్కుల వైపు వెళ్లాలనుకుంటున్న కాలనీవాసుల పరిస్థితి ఇబ్బం దిగా మారింది. మార్నింగ్ వాక్ కోసం పార్కులను ఆశ్రయిస్తున్న వాకర్లకు పార్కుల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఆందోళనకు గురవుతున్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో గల సాయికృప షిర్డిసాయినగర్‌లో పార్కు నిర్మాణం పూర్తయి చివరి దశలో ఉంది. కానీ ఇప్పటి వరకు పార్కు ప్రారంభం కాలేదు. అక్కడ ఉన్న కాలనీవాసులు పార్కులోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. పార్కులో నాటిన మొక్కలు కూడా నిర్వహణ లేక ఎండిపోయాయి. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులు సైతం శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. మూడేళ్ల క్రితం పార్కు ఏర్పాటుకు డబ్బులు ఖర్చుచేసినా.. పార్కు ప్రారంభం చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. పార్కు గేటు సరిగ్గా లేకపోవండతో పార్కులో కుక్కలకు ఆవాసంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకుని పార్కును ప్రారంభించాలని, పిచ్చిమొక్కలను తొలగించి అందులోని ఆటవస్తువులను ఉపయోగంలోకి తేవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వెంటనే పార్కును ప్రారంభించాలి..

: విలాస్, కాలనీవాసి

పార్కు పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ ప్రారంభించలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కు మొత్తంగా పిచ్చి మొక్కలు, చెత్తా పేరుకుపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన పిల్లల ఆటవస్తువులు సైతం తుప్పు పట్టిపోతున్నాయి. పార్కులో పారిశుధ్యం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి పార్కును ప్రారంభించి అభివృద్ధి చేయాలి.

కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలి

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించి కల్వర్టును పరిశీలించిన ఎమ్మెల్యే



కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అధికారులు

బోధన్‌రూరల్, ఆగస్టు 12: పట్టణంలో ప్రమాదకరంగా మారిన కల్వర్టులను పరిశీలించి వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా కల్వర్టు' అనే కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. సోమవారం పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా నుంచి తట్టికోట వెళ్లే దారిలో ప్రమాదరంగా ఉన్న కల్వర్టును ఆయన పరిశీలించారు. ప్రమాదకర కల్వర్టులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

నవీపేట, ఆగస్టు 12: మండలంలోని జన్నేపల్లి వాగు బ్రిడ్జి పై సోమవారం బైక్ అదుపు తప్పి కింద పడడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బీపీఎం గంగారాంకు గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.నందిపేట మండలం నూత్‌పల్లి నుంచి జన్నేపల్లిలో విధులు నిర్వహించడానికి వస్తున్న గంగారాం జన్నేపల్లి వాగు బ్రిడ్జి రోడ్డుపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో అతని కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించడం జరిగిందని వారు పేర్కొన్నారు. జన్నేపల్లివాగు బ్రిడ్జి రోడ్డుపై ఒకేవైపు సీసీ వేయగా మరో వైపు వేయకపోవడంతో ఒకే మార్గంలో ఇరువైపు నుంచి వాహనాలు రావడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సోమవారం ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురించిన విషయం విదితమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జన్నేపల్లి వాగు బ్రిడ్జి రోడ్డుపై రెండో వైపున సైతం సీసీ రోడ్డును వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

రుద్రూరు, ఆగస్టు 12: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో స్వాధీనం చేసుకుని తిరిగి బాధితురాలికి సోమవారం రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో అందజే శామని ఎస్‌ఐ అప్పారావు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. ఎవరైనా తమ మొబైల్ దొంగిలించబడిన పోగొట్టు కున్న వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ అప్పారావు పేర్కొన్నారు.

కోటగిరి ఎంపీడీవోగా చందర్ బాధ్యతల స్వీకరణ

కోటగిరి, ఆగస్టు 12: కోటగిరి ఎంపీడీవోగా చందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవోగా ఉన్న చందర్‌కు ఎంపీడీవో అదనపు బాధ్యతలు అప్పగిచారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన మనోహర్ రెడ్డి పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఎంపీవోకు పూర్తి స్థాయి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు.ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ఎంపీడీవో మనోహర్ రెడ్డి, సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించకుంటే చర్యలు తప్పవు

సుభాష్‌నగర్, ఆగస్టు 12: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ మందమకరంద్ సిబ్బందిని హెచ్చరించారు. నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తమ ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వర్తించాలని నగర ప్రజలు ఎవరైనా తమ పనుల నిమిత్తం వస్తే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. డివిజన్ స్థాయిలో సమస్యలపైన ఆ డివిజన్‌కు సంబంధించిన అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. ఈసమీక్ష సమావేశం మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు

భిక్కనూరు, ఆగస్టు 12: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరో గ్యకేంద్రంలో సోమవారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోషకాహార విలువలు, గర్భాధారణ సమయంలో వచ్చే సామాన్య సమస్యలకు పరిష్కారాలు, రక్తహీనతపై వైద్యులు అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ శుక్రోచ్ ఇంజక్షన్ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రమణ, పీహెచ్ఎన్ రాణీ, హెల్త్‌సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్నమొత్తాల పొదుపుపై అవగాహన

రాజంపేట, ఆగస్టు 12: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో తపాల ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇంటింటికి తిరిగి తపాలశాఖ స్కీమ్స్ ప్రజలకు వివరించినట్లు తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ ఆఫీస్‌వద్ద సమావేశం నిర్వహించి సేవింగ్స్ ఖాతాలు, ఇన్సూరెన్స్ స్కీమ్‌లు మొదలగు వాటి గురించి అవగాహన కల్పించి, ప్రజలందరూ చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థులకు సుకన్య సమృద్ధి, పీఎఫ్‌ల గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో రాజంపేట ఎస్‌పీఎం బిక్షపతి, ఎంఓ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలి

సదాశివనగర్, ఆగస్టు 12:ప్రతి ఇంటిలో త్రివర్ణపతాకాన్ని ఎగరవేయాలని విద్యాశాఖాధికారి యూసప్ అన్నారు. సోమవారం ధర్మారావుపేట్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ప్రతిజ్ఞను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని దేశం పట్ల జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని కలిగి ఉండి దేశసేవలో ముందుం డాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యూర్ ఆప్ ఇండియాన్ స్టాండర్డ్ ఇంచార్జ్ కృష్ణాకర్‌రావు, ఉపాధ్యాయులు జీవలత, నరేందర్, దయానంద్, జైపాల్‌రెడ్డి,స్వామి, రాజు,శ్రీనివాస్, చిన్నయ్య,అన్వర్‌లు పాల్గొన్నారు.

పోతంగల్‌లో ఇసుక డంప్‌ల సీజ్



పోతంగల్‌లో ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న ఆర్ఐ

కోటగిరి,ఆగస్టు12: పోతంగల్ మండల కేంద్రంలోని మంజీర బ్రిడ్జి అవతలి భాగంలో 18ట్రాక్టర్‌ల ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. మంజీర బ్రిడ్జి అవతలి భాగంలో ఇసుకను అక్రమంగా డంప్ చేశారని సమాచారం రావడంతో ఆర్ఐ సాయిలు అక్కడికి చేరుకుని ఇసుక డంప్‌లను పరిశీలించి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంప్‌కు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేల దారవత్తు చెల్లించాలన్నారు. అక్రమంగా ఇసుక డంప్ చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

వృద్ధురాలి బంగారు గొలుసు అపహరణ

ఖిల్లా, ఆగస్టు12: మాయమాటలతో వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని మహిళ అపహరణ ఘటన నగర శివారులోని రూరల్‌పోలీసు స్టేషన్ పరిధిలో గల విద్యుత్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. విద్యుత్‌నగర్‌కు చెందిన సరోజదేవి అనే వృద్ధురాలు ఒంటరిగా ఉండడాన్ని గుర్తించిన ఓగుర్తు తెలియని మహిళ ఆమె ఇంటికి వచ్చి ఆమెను మాటల్లో దించి ఆమెమెడలో ఉన్న సుమారు తులంబంగారు గొలుసును ఎత్తు కెళినట్లు రూరల్ ఎస్ఐ మహేష్ తెలిపారు. తర్వాత తేరుకున్న వృద్ధురాలు సమాచారాన్ని ఆమె కుటుంబసభ్యులకు అందించింది. వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● వృద్ధులను ఒంటరిగా వదలరాదు : నిజామాబాద్ ఏసీపీ

కుటుంబ సభ్యులు దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇండ్లలో ఒంటరిగా వృద్ధులను వదిలి వెళ్లరాదు. వెళ్లిన చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వాలి. కొత్త వారితో అప్రమత్తంగా వ్యవహరించాలి. కాలనీల్లో అనుమానస్పదంగా సంచరించే వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధుల వద్ద విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు ఉంచకుండా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● లక్షా 3వేల నగదు స్వాధీనం

ఖిల్లా, ఆగస్టు 12: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారం మేఘన డెంటల్ కాలేజీ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి వారి వద్ద నుంచి రూ.లక్షా 3,810 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీపీ కల్మేశ్వర్ సింగెనెవార్ ఆదేశాల మేరకు ఖచ్చితమైన సమాచారంతో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామని తదుపరి విచారణకై రూరల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

అపరిచిత లింకులు ఓపెన్ చేయరాదు

ఖిల్లా, ఆగస్టు12 :తమ సెల్‌ఫోన్ వాట్సాప్‌కు వచ్చే అపరిచిత లింకులను ఓపెన్ చేయరాదని నగర ఇన్‌స్పెక్టర్ నరహరి తెలిపారు. సోమవారం ఆయన చాంబర్‌లో వివరాలను వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హ్యాపీ ఇండిపెడెన్స్‌డే అంటూ మెసెజ్‌లు, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా రివార్డు వచ్చిందని చెబుతుంటారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారు పంపిన లింకులు పంపి వాటిని ఓపెన్ చేయాలని సూచిస్తారని తెలిపారు. అటువంటి లింకుల జోలికి వెళ్లరాదని సూచించారు. అవి ఓపెన్ చేయగానే తమ ఖాత నుంచి డబ్బులు మాయం అవుతాయని చెప్పారు. సైబర్ నేరాగాళ్ల ఉచ్చులో పడకుండా ఉండేందుకు తమకు సంబంధం లేని లింకులను ఓపెన్ చేయరాదని తెలిపారు.తమకు పరిచయం లేని వ్యక్తుల నుంచి కొత్త కొత్త లింకులు వచ్చినచో వెంటనే పోలీసు శాఖకు తెలియ జేయాలని సూచించారు.

ఉపాధి లభించే కోర్సుల ద్వారా ఎంతో మేలు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: ఉపాధి లభించే కోర్సుల ద్వారా విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని అందువల్లే ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో నూతనంగా వృత్తివిద్యా కోర్సులను ప్రారంభించడం జరిగిందని విద్యాసంస్థల అధినేత డాక్టర్ మారయ్యగౌడ్ అన్నారు. సోమవారం కళాశాలలో ఇన్నో వేషన్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషనల్ ఆక్టివిటీ అనే అంశంపై ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు కోర్సు చేస్తున్న విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శ్రీశైలం విచ్చేసి ప్రస్తుత వైద్య రంగంలో శిక్షణ పొందిన వారికి అనేక అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు శ్రద్ధతో కోర్సులను పూర్తి చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో తమ సేవలను అందించాలని ఉద్యోగాల కల్పనకు తమవంతు సహకారం ఉంటుందని తమ ఆసుపత్రిలో సైతం అవకాశం కల్పిస్తామన్నారు. గవర్నమెంట్ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి మాట్లాడుతూ పారామెడికల్ కోర్సులో చేరిన విద్యార్థులను అభినందించారు. సమాజంలో పారామెడికల్ సిబ్బందికి మంచి గుర్తింపు ఉందని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో శిక్షణ పొందాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆఫ్ ప్రాన్స్, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన హార్ట్, లంగ్స్, కిడ్నీ కమ్యూనిటీ హెల్త్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్స్ మొదలైన మోడల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వొకేషనల్ విద్యార్థులతో విద్యాసంస్థల డైరెక్టర్ మారయ్యగౌడ్

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంకు సంధ్య

● మొత్తం 18మంది సభ్యుల నియామకం చేసిన ప్రభుత్వం

నిజామాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):జిల్లాలో వ్యవ సాయ మార్కెట్ కమిటీల నామినేటెడ్ పదవుల భర్తీ మొదలైంది. ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ఈ పదవులను భర్తీ చేస్తున్నారు. బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు మొత్తం 18 మంది పాలకవర్గ సభ్యులను ప్రకటించారు. ఈమేరకు సహకార, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి రెండేళ్లపాటు పదవుల్లో ఉంటారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. జిల్లాలోని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు 18మంది సభ్యులను ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి సిఫారసుల మేరకు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చైర్మన్ ఎంపికతో పాటు వైస్ చైర్మన్, 16మంది సభ్యులను ప్రకటించారు. ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఈ పదవులను ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మార్కెటింగ్‌శాఖలోని ఆయా సెక్షన్‌ల ప్రతిపాదిక ప్రకారం వీరిని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంకు సంధ్యను నియమించారు. కీలకమైన చైర్మన్ పోస్టును మహిళకు కట్టబెట్టారు. వైస్ చైర్మన్‌గా చీల శంకర్‌ను నియమించారు. పాలకవర్గం సభ్యులుగా కర్నె గంగారాం, కండెపు వెంకటేశ్వర్ రావు, నడిపోల్ల వసం త్ రెడ్డి, రమావత్ రవిదాస్, సంగపు భూమయ్య, బొబ్బిలి శ్రీనివాస్, చేపూరి గంగకిషోర్, నీరడి సాయన్న, బర్రోల్ల శ్రీనివాస్, సలీం బేగ్, ఆవుల బాలకృష్ణారెడ్డి, చీకోటి అంజయ్యలను సభ్యులుగా నియమిం చారు. వీరితోపాటు జైతాపూర్ సహకార సంఘం చైర్మన్, జిల్లా మార్కె టింగ్ అధికారి, వ్యవసాయ శాఖ బోధన్ అసిస్టెంట్ డైరెక్టర్, బోధన్ మున్సిపాలిటీ చైర్మన్లను కూడా మార్కెట్ కమిటీ సభ్యులుగా నియా మకం చేశారు. జిల్లాలో 7వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా బో.దన్ పాలకవర్గాన్ని నియమించారు.రాష్ట్రంలోనే అతి పెద్దదైన నిజామా బాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, వర్ని, కోటగిరి, కమ్మర్‌పల్లి, వేల్పూ ర్ మార్కెట్ కమిటీల పాలకవర్గాలను కూడా త్వరలోనే నియామకం చేయనున్నట్లు తెలుస్తుంది. వీటికి సంబంధించిన చైర్మన్లు, సభ్యులుగా ఎమ్మెల్యేలు ఇప్పటికే సిఫారసు చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎక్కువ మంది పోటీ పడుతుండడం వల్ల చర్చలు జరిపి నియామకం చేయనున్నట్లు తెలిసింది.

ముదిరాజ్‌లను బీసీఏలోకి మార్చాలి

డొంకేశ్వర్, ఆగస్టు12: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి వెంటనే మార్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మోత్కు శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం డొంకేశ్వర్ మండలం తహసీల్దార్ వెంకటరమణకు పలు డిమాండ్‌లతో మండల అధ్యక్షుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చేందుకు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయగా బీసీ కమిషన్‌కు నివేదిక అందించాలని కోర్టు సూచించడం జరిగిందన్నారు. నివేదిక అందించడంతో జాప్యం జరగడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ముదిరాజ్‌లను బీసీడీ నుంచి ఏలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాని తగిన బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. వెంటనే రూ.1000కోట్లతో నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో ముదిరాజ్‌లకు మత్స్యశాఖ సొసైటీలో సభ్యత్వం ఇవ్వడంలేదని మండిపడ్డారు. 18ఏళ్లు నిండిన యువతకు సభ్యత్వాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార విభాగం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు టి.రాజేశ్వర్, మండల ప్రధానకార్యదర్శి దశరథ్, మండల కార్యవర్గ సభ్యులు మద్దుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



డొంకేశ్వర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ర్యాలీ

వేల్పూర్, ఆగస్టు12: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ భీమ్‌గల్ పట్టణంలో మాలలు ర్యాలీ నిర్వహించారు అనంతరం. జేబీఆర్ ఫంక్షన్ హాల్లో మాలల సంక్షేమ ఐక్య వేదిక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మండలాల, గ్రామాల నుంచి మాలలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాబోయే రోజుల్లో మాల జాతి అభివృద్ధి కోసం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం కంకణం కట్టుకొని ముందుకు సాగాలని సమావేశంలో తీర్మానం చేశారు. అంతకు ముందు భీమ్‌గల్ బస్టాండ్ నుంచి మాలలు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఎస్సీవర్గీకరణ అంశం ఉపసంహరించుకోకుంటే కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. మాలలందరిని ఐక్య చేసి హైదరాబాద్‌లో త్వరలో పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు మాలలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని మండలాల్లోని గ్రామాలకు చెందిన మాలలు హాజరయ్యారు.



భీమ్‌గల్‌లో ర్యాలీగా వెళ్తున్న మాలలు

సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని క్రమబద్ధీకరణ చేయాలి



మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

బోదన్‌రూరల్,ఆగస్టు12: సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని క్రమబద్ధీకరణ చేయాలని, ఆలోపు కనీస వేతనం అమలు చేయాలని, రూ.10లక్షల బీమా, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10లక్షల ప్రయోజనం కల్పించాలని బోధన్ సమగ్రశిక్ష మండల అధ్యక్షుడు బాబు అన్నారు. సోమవారం బోధన్ ఎంఈవో కార్యాలయం ఎదుట గతంలో మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున తక్కువ వేతనాలతో పాటు పని తీవ్రత పెరగడం, పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబ పోషణ భారాన్ని మోయలేక నిరాశ, నిస్పృహలకు లోనై గుండె పోటుతో గత 15సంవత్సరాల నుంచి సుమారు 200మందికి పైగా మరణించారని పేర్కొన్నారు. మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యుసుఫ్ అలీ, మండల ఇన్‌ఫర్మేషన్ సిస్టం నగేష్, మానస, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని విద్యవనరుల కేంద్రంలో గతంలో మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు సోమవారం నాడు ఘన నివాళులు అర్పించారు. మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నవీన్, సాయిరాం, శ్రావణ్, పరిమళ, ప్రేమ స్వరూప, వినిత, సురేష్, రాము, మధశేఖర్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సోమవారం స్థానిక కస్తూర్బా గిరిజన బాలికల పాఠశాలలో మధ్యాహన్న భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏ సి అధ్యక్షుడు ప్రవీన్, జిల్లా మహిళ అద్యక్షురాలు గంగామ ణి, ఎమ్మార్సీసిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున తక్కువ వేతనంతో పాటు పని తీవ్రత పెరగడం వల్ల కుటుంబ భారం మోయలేక నిరాశ కు గురి అయి ప్రతి నెల ఇద్దరు ఉద్యోగులు మరిణిస్తున్నారని ప్రభుత్వం మరణించిన ఉద్యోగుల స్థానంలో వేతనలు పెంచి వారి కుటుంబాలను ఆదు కోవాలని ఫ్లకార్డులతో , నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జీవిత బీమా, ఆరోగ్య భీమా ఉద్యోగ విరమణ చేసిన వారికి 10లక్షల అంద జేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీర్పీలు, సమాగ్ర శిక్షణ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్దగల కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జెండాను రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ సంఘం స్వతంత్ర ఉద్యమ సమయంలో ఏర్పడిందని విద్యారంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు.కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై స్పందించాలని యూనివర్సిటీలలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుశాల్, శివాజీ, సుమన్, సాయి, విఠల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, ఆగస్టు12: ఆర్మూర్ పట్టణంలోని సిద్దులగుట్ట సోమవారం శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. శివాలయంలో పంచామృతలతో అభిషేకాలు చేశారు. రామాలయం, దుర్గామాత, దత్తత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మలయ్య, బోండ్ల ఆనంద్, బట్టు శంకర్, శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, కొంతం సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు12: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళ వారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజులు తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, వివిధ అధికారులు హాజరుకావాలని వారు సూచించారు.

నేడు ఉపాధిహామీ పనులపై ప్రజా వేదిక

రుద్రూరు, ఆగస్టు 12: రుద్రూరు మండల సమీకృత భవనంలో నేడు (మంగళవారం) ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ పథకం పనులపై మండల స్థాయి ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సురేష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు కావాలన్నారు. ఈ ప్రజా వేదికకు సకాలంలో అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

హిందువులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనాలి

పెద్దబజార్, ఆగస్టు 12: బంగ్లాదేశ్ హిందువులకు మద్దతుగా నగరంలో ఉన్న హిందువులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వివిధ సంఘాల నాయకులతో సమావేశమై బంగ్లాదేశ్ సంఘటనపై స్పందిస్తూ బంగ్లాదేశ్‌లోని హిందూ ఆడబిడ్డలపై, దేవాలయాలపైన జరుగుతున్న మారనఖాండకు నిరసనగా వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 13న సాయంత్రం 6గంటలకు నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హిందూ సంఘ్ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గడ్డం రాజారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



గడ్డం రాజారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బోధన్ ఎమ్మెల్యే

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు12: ఇటీవల మృతి చెందిన లాలన ఆశ్రమ వ్యవస్థాపకుడు గడ్డం రాజారెడ్డి కుటుంబసభ్యులను సోమవారం బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ మాజీఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మలు పరామర్శించారు. రాజారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గడ్డంరాజారెడ్డి సేవ కార్యక్రమాలు మరువలేనివన్నారు. ఆయన వెంట ఉర్దూ అకాడమికి ఛైర్మన్ తాహెర్ బిన్‌హందాన్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ మార చంద్రమోహన్, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీఛైర్మన్ యాల్ల సాయిరెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్యశ్రీ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుగుడు ఇస్సాపల్లి జీవన్, అంకాపూర్ మాజీసర్పంచ్ కిశోర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ ఉమన్న, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వెల్మల్ టూ నందిపేట బస్ ప్రారంభం



వెల్మల్‌లో బస్‌ను ప్రారంభిస్తున్న వీడీసీ సభ్యులు

నందిపేట, ఆగష్టు12: నందిపేట మండలంలోని వెల్మల్ గ్రామంలో సోమవారం ఆర్‌టీసీ బస్‌ను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఆర్మూర్ నుంచి వయా వెల్మల్ మీదుగా నందిపేట వరకు సుమారు మూడు ట్రిప్పులు బస్ సౌకర్యం ప్రయాణీకులకు కలుగనుంది. ఇటీవల గ్రామస్తులు ఆర్‌టీసీ అధికారులను కలిసి విన్నవించారు. స్పందించిన అధికారులు ఆర్మూర్ డీపోకు చెందిన బస్‌ను వేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు పూజా కార్యక్రమాన్ని కొనసాగించి బస్ ట్రిప్పును ప్రారంభించారు. వెల్మల్ నుంచి ఉదయం 9గంటలకు, మధ్యాహ్నం 1.30, సాయంత్రం 5.45 గంటలకు ఉంటుందని అలాగే నందిపేట నుంచి ఉదయం 9.45, మధ్యాహ్నం 2.15, సాయంత్రం 6.30 గంటలకు ఉంటుందని ఆర్‌టీసీ ఆర్మూర్ డీపో అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్సాపల్లి నరేందర్, ముప్పెడ నారాయణ, గంగాధర్ మల్లేష్, ఉద్దిరి రవి, అల్లెం భూమేష్, ఆర్‌టీసీ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

జీసీడీవోగా భాగ్యలక్ష్మి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: సమగ్ర శిక్ష అభియాన్ జీసీడీవోగా జడ్పీహెచ్ఎస్ ఇందల్వాయి గెజిటెడ్ హెచ్ఎం కె.భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లు పూర్తైన జీసీడీవోలను తొలగించి వారి సొంత స్కూళ్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. గత నెల రోజులుగా జీసీడీవో పోస్టు ఖాళీగా ఉండగా గతంలో నిర్వహించిన జీసీడీవో పరీక్షలో మొదటి స్థానం పొందిన భాగ్యలక్ష్మిని జీసీడీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్ల పాటు వీరు ఈ పదవిలో ఉండనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9 జిల్లాలకు కోఆర్డినేటర్లను నియమించారు. అందులో భాగంగా నిజామాబాద్‌కు జీసీడీవోగా భాగ్యలక్ష్మిని నియమించారు.

నేడు రుద్రూరు మండల బంద్‌కు పిలుపు

రుద్రూరు,ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాల యాలపై జరుగు తున్న దాడులను నిరసిస్తూ నేడు (మంగళవారం) రుద్రూ రు మండల బంద్‌కు హిందూ ఐక్య వేదిక పిలుపునిచ్చింది. రుద్రూరు మండలంలో అన్ని వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, హోటల్స్ షాపింగ్ మాల్స్ శాంతియుతంగా బంద్ పాటించాలని పిలుపునిచ్చారు.

నేడు మోర్తాడ్ బంద్

మోర్తాడ్: ఈనెల 13న మోర్తాడ్ బంద్ నిర్వహిస్తున్నామని విశ్వహిందు పరిషత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా మోర్తాడ్ బంద్ సంపూర్ణంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. మంగళవారం స్వచ్ఛందంగా అన్ని వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, హోటళ్లు శాంతియుతంగా బంద్ పాటించాలని విశ్వహిందు పరిషత్ కోరింది.

రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లలో ఆయిల్ చోరీ

నవీపేట,ఆగస్టు12: మండలంలోని నవీపేట, నాగేపూర్ శివారులలో ఉన్న రెండు ట్రాన్స్‌పార్మర్‌ల ఆయిల్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని తెలిపారు. నవీపేట శివారులోని 63 కేవీ ట్రాన్స్‌పార్మర్‌తో పాటునాగేపూర్ శివారులోని 40కేవీ ట్రాన్స్‌పార్మర్‌లను ధ్వంసంచేసి దొంగలు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని ఆమె వివరించారు.ఈవిషయంపై నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమెఅన్నారు.

అంతర్జాతీయ యువజన దినోత్సవం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు12: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించగా రన్నర్‌గా శ్రీరాంనగర్ క్లబ్ విన్నర్‌గా యంగ్‌స్టార్ క్లబ్‌లు గెలుపొందగా వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, చాటర్‌మెంబర్ ప్రిమియర్ గంగారెడ్డి, సభ్యులు అంబల్ల తిరుపతి, శశిధర్‌రెడ్డి, జ్ఞానీచావ్లా, ఖైరి శ్రీధర్, విజయానంద్, హన్మాండ్లు, లక్ష్మణ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాల సర్వే

ఆర్మూర్‌టౌన్ , ఆగస్టు12: పట్టణంలోని రాజారాంనగర్‌లో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా తిరుగుతూ జ్వరాల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ సీజనల్ వ్యాదులు రాకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని దోమల నిల్వ ఉండకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని, విషజ్వరాలు ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరాలు ఎక్కువ రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వేనిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చెట్ల నరికివేత

నవీపేట,ఆగస్టు12: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పలు చెట్లను సోమవారం విద్యుత్ సిబ్బంది నరికివేశారని స్థానికులు తెలిపారు. 10సంవత్సరాల క్రితం హరితహారంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో పెద్దఎత్తున మొక్కలు నాటగా ప్రస్తుతం అవి చెట్లుగా మారాయని వారు పేర్కొన్నారు. విద్యుత్ వైర్లకు తగులుతున్నాయనే నెపంతో చెట్ల కింది భాగంలో నరికి వేయడం శోచనీయమని వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి, ఆగస్టు12: మండలంలోని చింతలూర్ గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులను కొలిప్యాక్ సింగిల్ ఛైర్మన్ నాగుల శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్‌లు కలిసి అందజేశారు. దాత ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న రఘు ఉత్తమ విద్యార్థులకు క్రీడా దుస్తులను కొనుగోలు చేసి వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’కి వినతుల వెల్లువ

● వివిధ గ్రామస్థుల నుంచి భారీగా వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం ఫిర్యాదులు వెల్లువలా వచ్చాయి. అర్జీలకు ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 154 వినతులు వచ్చాయి. కజిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డిఆర్‌డివో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్‌డివో రాజేంద్రకుమార్‌లకు విన్నవిస్తూ ఆర్జీలను సమర్పించారు. కాగా ప్రజల నుంచి తీసుకున్న ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆర్జీదారులకు సమాధానం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్‌కు వచ్చిన సుర్బిర్యాల్ గ్రామస్థులు

ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌కు చెందిన గ్రామ సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. గ్రామంలో సర్వసమాజ్ కమిటీకి మంజూరైన నిధులను మాజీ సర్పంచ్ తన ఇష్టానుసారంగా వినియోగించుకొని ఖర్చు చేశారని అదేవిధంగా గ్రామ అభివృద్ధికి మంజూరైన నిధులను పనులుచేయకుండా చేశానని చూపెట్టి బిల్లులు పెట్టుకొని డబ్బులను తన సొంతానికి వాడుకున్నారని ఈ విషయమై గతంలోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటికి చర్యలు తీసుకోలేదని అన్నారు. 2019 నుంచి 24 వరకు గ్రామానికి మంజూరైన పూర్తి నిధులు మరియు పనులకు సం బంధించిన వివరాలను తమకు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్ సవిత గణేష్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

● భూకబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

నవీపేట మండలం యంచ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 270, 271, 272లలో నిజమైన పట్టాదారుల పట్టాలను అక్రమంగా పట్టా చేసుకొని నిజమైన పట్టాదారు భూములను, ప్రభుత్వ భూములను దౌర్జన్యంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అక్రమంగా కబ్జా చేసి పట్టాలు చేసుకున్న వారి పట్టాలను రద్దు చేసి నిజమైన పట్టాదారులకు న్యాయం చేయాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

● సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,ఆగస్టు12: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి నుంచి శక్కర్‌నగర్ వెళ్లే మార్గంలో డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మాణంలో ఆరు అంగుళాల పైపులు పెంచాలని ఎక్కడ వర్షపు నిల్వ ఉండకుండా కొత్త డిజైన్‌తో నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు.అనంతరం పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల బస్తీ దవాఖానాను సందర్శించారు. బస్తీ దవాఖానాలో ప్రజలకు అవరమైన మందులను అందుబాటులో ఉంచామన్నారు. వర్షకాలం సీజన్‌లో పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరాలు వస్తాయని, వీరిని వైద్యులు పరిశీలించి పిల్లలకు సరిపడ మోతాదుకు సంబంధించిన మాత్రలను మాత్రమే వేయాలన్నారు. పిల్లల వయసు, రోగాలను నిర్ధారించుకుని మెరుగైన వైద్యం అందించాలన్నారు. బోదన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి వైద్యురాలు లేకపోవడంతో ఒక మహిళ వైద్యురాలిని నియమించామని ప్రజలు సమన్వయంతో వైద్యం చేయించుకోవాలన్నారు. త్వరలోనే మరో ఇద్దరు గైనాకాలాజిస్టులను నియమిస్తామన్నారు. అనంతరం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ యంత్రాంగం పకడ్బందిగా చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వాలు ఎటువంటి అభివృద్ధి చేయకుండానే పది సంవత్సరాల పాటు కాలం వెళ్లదీశాయని అన్నారు. బోధన్ మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. బోధన్ పట్టణంలో ట్రాక్టర్లకు మరమ్మతులు చేసి, బోధన్ మున్సిపాలిటీలో తీసుకువెళ్లే వాహనాలను పరిశీలించారు. వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. పట్టణంలో కురుస్తున్న వర్షాలకు గుంతలు ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంకర పౌడర్‌తో గుంతలను పూడ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

● యువత సాంకేతికంగా అన్ని రంగాలలో రాణించాలి

బోధన్ నియోజకవర్గ యువత సాంకేతికంగా అన్ని రంగాలలో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ ఐటీఐ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం అత్యాధునిక టెక్నికల్ కోర్సులను నేర్పిస్తున్నామన్నారు. అర్హులైన యువత ఐటీఐ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, సంబంధిత శాఖ అధికారులు, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, పిట్ల సత్యం, దాములతో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షులు పాషామొయినోద్దీన్, చిరంజీవి, ఆయా వార్డుల కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులకు ప్రవేశాలను నిర్వహిస్తున్నట్లు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, కోర్సు కోఆర్డినేటర్ రంజితలు తెలిపారు. కళాశాలలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెగ్యులర్ కోర్సులు లాగానే ఈ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, పీజీ కోర్సులను నిర్వహిస్తున్నామని గిరిరాజ్ కళాశాల ప్రాంతీయ కేంద్రంతో పాటు జిల్లాలోని ఇతర కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి డిగ్రీ, పీజీలో ప్రవేశాలు కల్పించడంతో పాటు మెటీరియల్‌ను కూడా అందిస్తామని తెలిపారు. కళాశాల పరిధిలో తరగతులను కూడా నిర్వహిస్తామని వారు తెలిపారు.ఈ కోర్సులకు సంబంధించిన కరపత్రాన్ని కూడా వారు విడుదల చేశారు. కోర్సుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. బిఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎసీ,ఎంఎల్ఐఎసీ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా కొన్ని డిప్లొమా కోర్సులను కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కళాశాల అధ్యాపకులు వినయ్‌కుమార్, రాజేష్, రాహుల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంజర్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

మోపాల్,ఆగస్టు12: మండలంలోని కంజర్ గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గత ఐదురోజుల నుంచి వైద్య అధికారులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా విద్యార్థులకు అన్నిరకాల వైద్య పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ మాధవి, సందీప్, హెల్త్ సూపర్‌వైజర్ స్వప్నలు అన్నారు. ప్రతీనెలా పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పాఠశాలలో సుమారు 622 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. ప్రధానంగా విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి మెరుగైన వైద్యాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 14న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి.మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్నపూర్ణ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్, పసిఫిక్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు ఫీల్డ్ క్రెడిట్ ఆఫీసర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు ఉద్యోగ నియామకం కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఇంటర్మీడియెట్, బీఈ, బీటెక్, ఐటిఐ ఇన్ ఈఈఈ, ఈసీఈ, డిగ్రీ పాసైన యువతీ యువకులు అర్హులని ఎంపికైన వారు నిజామాబాద్, హైదరాబాద్ తెలంగాణలోని అన్ని ప్రాంతాలలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 14న ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నంలోపు శివాజీనగర్‌లోని ఐటీఐలోగల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలని ఆయన తెలిపారు.అభ్యర్థులు తమరెజ్యూమ్‌తో పాటు బయోడేటా,ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫోటోలను వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.ఇతరవివరాలకు 9581768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలి

డిచ్‌పల్లి,ఆగస్టు 12:టీయూ పరిధిలో సెట్, నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులై వున్న అభ్యర్థులకు పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేసేల ఆవకాశం కల్పించాలని వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినాయకులు రిజిస్ట్రార్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు.పీహెచ్‌డీ గైడెన్ సీట్లను భర్తీ చేయాలని చేయకపోవడంతో నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల అభ్యర్థులు నష్టపోతున్నరని వెంటన్ సీట్లను భర్తీ చేయలన్నారు. ఈకార్యక్ర మంలో అమృత్‌చారి, అక్షయ్, వినీల్, పాల్గొన్నారు.

నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, ఆగస్టు 12: దేశ స్వాతంత్రం కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారి ఆత్మలను బలిదానం చేయడం జరిగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు. స్వతంత్ర సమరయోధుల త్యాగాల ఫలితమే ఈ రోజు స్వచ్ఛ వాయువులను పీల్చుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఆ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యతను, జాతీయతను, దేశభక్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పుకుంటున్నామని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు అనుసరించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. దేశభక్తిని పెంపొందించే విధంగా చత్రపతి శివాజీమహారాజ్‌కి జిజియాబాయి దేశభక్తిని ఎలా నూరి పోసిందో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు అలాగే నూరి పోయాలని ఆయన పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వీరులు, వీరవనితలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు పోవాలని కోరారు.తిరంగా ర్యాలీ గాంధీచౌక్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించారు.ఈకార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, న్యాలంరాజుతో పాటు కార్పొరేటర్లు, పార్టీనేతలు పాల్గొన్నారు.

సిరికొండ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సిరికొండలో బీజేవై ఎం ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను చేతబట్టి సిరికొండ ప్రధాన వీధుల్లో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.తెలంగాణ తల్లి విగ్రహం నుంచి నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి,నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం యువమోర్చా కన్వీనర్ అరికెల శ్రీకాంత్‌రెడ్డి,శ్రావన్‌రెడ్డి, గోపి పాలొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో సోమవారం హర్‌ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులతో పాటు యూత్ సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, రాధ, గణేష్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, రాము, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువతలో దేశభక్తిని చాటడానికి, దేశ ఐక్యతను నిలుపు కోవడానికి ప్రధాన మంత్రి మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు హర్ ఘర్ తిరంగాలో భాగంగా జాతీయ జెండాలతోఊరూర తిరిగారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్,జిల్లా అధ్యక్షులు నాగ సురేష్, ప్రధాన కార్యదర్శి మందుల బాలు, మండల అధ్యక్షులు అజిగిరి సాయినాథ్, మండల కన్వీనర్ కొహినూర్ అనీల్, నాయకులు త్రివేద్, వికాస్, గద్దె రవి ఉన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్



ధర్పల్లిలో రోగులను పరీక్షిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ధర్పల్లి, ఆగస్టు 12: డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో హెల్త్ క్యాంప్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత నెల 22 నుంచి ఇప్పటి వరకు గ్రామంలో 11 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని అన్నారు. డెంగీ వ్యాధి ప్రబలడానికి ముఖ్య కారణం దోమలని ఆయన పేర్కొన్నారు. ఇంటి పరిసర ప్రాం తాల్లో నీటి నిల్వలు నిలువకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌనిక, రాజేందర్, భూలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా అరుణ

సుభాష్‌నగర్, ఆగస్టు 12: ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా జిల్లాకు చెందిన అరుణ జ్యోతిని నియమించారు. ఈ మేరకు ఉత్తర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సారెడ్డి నియామక పత్రాన్ని సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆశయాలను లక్ష్యాలను సమర్థవంతంగా అమలయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 12: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సిబిసి ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మానాయక్ అన్నారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలో రోజు రోజుకు మాదకద్రవ్యాలు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆయన అన్నారు.విద్యార్థులు వీటిపట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. యు వత చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని క్రమశిక్షణతో ముందుకు పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ బిఎస్ మీనా, ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటీవ్ మోహన్‌దాస్, సెం ట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ రషీద్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మానాయక్

కుర్మ సంఘానికి అండగా ఉంటా: రూరల్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఆగస్టు 12: కుర్మ సంఘానికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మోపాల్ మండల కేంద్రంలో ఉన్న బీరప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ కుర్మ సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుర్మ సంఘానికి తాను ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని ఏ సమస్య ఉన్నా తనను స్వయంగా సంప్రదించవచ్చని సూచించారు. మోపాల్ మండలంలోని ఆయా గ్రామాలకు ఆర్అండ్‌బి కింద రోడ్ల మంజూరు కోసం రూ.28 కోట్ల మంజూరు అయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి సమస్యతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని త్వరలోనే ధరణి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారమైతే రైతులు పడుతున్న ఇబ్బందులు పరిష్కారమవుతాయని అన్నారు.మంచిప్ప వద్ద నిర్మిస్తున్న ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందిస్తామన్నారు. ం ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, అమృతాపూర్ గంగాధర్, సాయరెడ్డి, కుర్మ సంఘం అధ్యక్షుడు దండు నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎర్రన్న, కార్యదర్శి రవి, కోశాధికారి జాయింట్ సెక్రెటరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండేది గ్రామ కార్యదర్శులేనని కార్యదర్శులందరు బాధ్యతలు విస్మరించకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి సూచించారు. సోమవారం రూరల్ నియోజకవర్గంలోని 7మండలాల గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవోలు, తహసీల్దార్ లు, ఎంపీవోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎల్పీవో శ్రీనివాస్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72700	రూ.67,000	రూ.855

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డి) (10.00, 7.30)
: శివం భజే (1.00)
: కల్కి(3.45)
: మురారి (10.30)
స్క్రీన్-2 : కమిటీ కుర్రాళ్లు (1.00, 7.25, 10.40)
: రాయన్ (4.15)
స్క్రీన్-3 : కేస్ నంబర్-15 (11.30)
: పాగల్ వర్సెస్ పాగల్ (1.55)
: సింబా (4.25)
: భవనమ్ (7.10, 10.10)
స్క్రీన్-4 : కమిటీ కుర్రాళ్లు (11.40)
: సంఘర్షణ (2.55)
: లాండ్ మాఫియా (5.20)
: ఆలియా బసూ గయాబ్ హై (హిందీ) (8.10)
: తుఫాన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కమిటీ కుర్రాళ్లు (10.25,4.40,7.40, 10.40)
: కల్కి(1.25)
స్క్రీన్-2 : మురారి (10.05)
:కమిటీకుర్రాళ్లు(1.25, 10.45)
: కల్కి (తెలుగు) (4.25, 7.40)
స్క్రీన్-3: మురారి (12.15, 3.50, 7.15, 10.40)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
రాయన్: (6.15, 9.15)
నటరాజ్ : భవనం (11.00, 2.00, 9.00)
మురారి (6.00)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15)
: మురారి (9.15)

- నిజామాబాద్ అర్బన్